క్లుప్తంగా

నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న ఎస్ఐ రమణారెడ్డి

టేకులపల్లి: గణేష్ శోభాయాత్ర సందర్భంగా నిర్వాహకులు, ప్రజలు నియమ నిబంధనలు, సూచనలు పాటించాలని టేకులపల్లి, బోడు ఎస్ఐలు గన్‌రెడ్డి రమణారెడ్డి, బత్తిని రంజిత్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై డీజేలకు అనుమతులు లేవని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై మద్యం మత్తులో ఉన్నవారిని అనుమతించకూడదన్నారు. ప్రతి విగ్రహం సాయంత్రం 6 గంటల లోపు నిమజ్జనం చేయాలని, చిన్నపిల్లలు, వృద్ధులను నిమజ్జనానికి తీసుకెళ్లొద్దని తెలిపారు. వాహనాలపై పరిమితికి మించి వెళ్లొద్దని, ఊరేగింపులో విద్యుత్ తీగలను గమనించి వాహనాన్ని నడపాలని, రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయొద్దని పేర్కొన్నారు. ఊరేగింపులో గొడవలు, కొట్లాటలు జరిగినా ఆయా కమిటీలు బాధ్యత వహించాలన్నారు.

జీపీ భవనానికి స్థల వితరణ



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సర్పంచ్, సెక్రటరీ, వార్డు సభ్యులు

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థలాన్ని దానం చేశారు. గ్రామానికి చెందిన తుమ్మలపల్లి పుల్లయ్య కుమారుడు వెంకటేశ్వర్లు తన తల్లి తుమ్మలపల్లి సుశీల జ్ఞాపకార్థం బేతాళపాడు వెళ్లే రోడ్డు పక్కనున్న వ్యవసాయ భూమిలోని 2.25 కుంటల స్థలాన్ని ఉచితంగా అందజేశాడు. మంగళవారం దాత వెంకటేశ్వర్లు, అతని తండ్రి పుల్లయ్యలను సర్పంచ్ బోడా కైక, పంచాయతీ సెక్రటరీ వెంకటయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు.

పీవైఎల్ కమిటీ ఎన్నిక

పాల్వంచరూరల్: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) నూతన కమిటీని మంగళవారం పాల్వంచలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసం బుచ్చిరాములు, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు అజయ్, ఉపాధ్యక్షుడు ఎనగంటి గణేష్, సహాయ కార్యదర్శి కోర్సా రామకృష్ణ, కోశాధికారి కొండకౌశిక్, కమిటీ సభ్యులుగా కాకా వెంకటేష్, కుంజ అర్జున్, ఇస్లావత్ కోటేష్, ననప కుమార్, పునెం మంగయ్య, ధరావత్ దేవా, బానోతు జగదీష్, ఏనుగుల సతీష్, చింత వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు బుచ్చిరాములు తెలిపారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిడ్ డే మీల్స్ వర్కర్లు మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసుకున్న సమ్మె శిబిరంలో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ.. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. రోజుకు రూ.33తో ఎలా బతకాలి అని ప్రశ్నించారు. తక్షణం పెండింగ్ బిల్స్, వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వంట కార్మిక సంఘం నాయకులు దాసుల పుష్పవతి, మంగ, ప్రభావతి, రాధ, విజయ, కుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో నిర్లక్ష్యం వద్దు..

- ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే క్షేమం
- సమన్వయంతో సంబురాలు విజయవంతం
- నేడు, రేపు గణేష్ నిమజ్జన వేడుకలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు (ఫైల్)

చుంచుపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆదిదేవుడు వినాయకుడిని కొలుస్తున్నారు. మరికొన్ని చోట్ల వినాయక మాలధారణ, కంకణధారణలు చేపట్టి భక్తిని చాటుకుంటున్నారు. ఇంకొన్నిచోట్ల పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను ప్రతిష్ఠించి ప్రత్యేకంగా కొలుస్తున్నారు. మండపాల్లో నిర్వాహకులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానాలు నిర్వహిస్తున్నారు. బుధ, గురువారాల్లో జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు జరగనున్నాయి. జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు మూడు వేల వినాయక విగ్రహాలు ప్రతి ఏటా భద్రాచలం గోదావరికి నిమజ్జనానికి తరలివెళ్తుంటాయి. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, నిమజ్జన ఉత్సవాల్లో ప్రమాదాలు పొంచి ఉంటాయని భక్తులు, యువకులు మరవొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఎంతో సంతోషంగా జరుపుకుంటున్న నవరాత్రులను అంతే ఆనందంతో ముగించుకోవాలని పేర్కొంటున్నారు. నిమజ్జనోత్సవంలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే సంబురాలు విజయవంతంగా ముగించుకోవచ్చని పోలీస్ శాఖ సూచిస్తోంది. జిల్లాలో ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు, జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. విగ్రహాలు మునిగేలా ఉండాలని లోతుకు వెళ్లి నిమజ్జనం చేస్తే ప్రమాదాలు పొంచి ఉంటాయి. వీటి విషయంలో కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే గణేష్ నవరాత్రి సంబురాలను ప్రశాంత వాతావరణలో ముగింపు పలకవచ్చు.

నిమజ్జన వాహనదారులు పాటించాల్సినవి...

- శోభాయాత్రలో ప్రధానంగా ఆయా వినాయక ప్రతిమలను ఊరేగించే వాహనాల డ్రైవర్లు చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రతిమలను చూసేందుకు పెద్దఎత్తున ప్రజలు వస్తుంటారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా ముందు వెనక చూసి సదరు డ్రైవర్లకు సూచనలివ్వాలి.
- నిమజ్జనం వెళ్లే వాహనం నడిపే విషయంలో అనుభవజ్ఞులైన డ్రైవర్లనే ఎంచుకోవాలి.
- డ్రైవర్‌కు ముందుగానే పోలీసులు, ఉత్సవ సమితివారు సూచించిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. డ్రైవర్ పూర్తిగా డ్రైవింగ్‌పైనే దృష్టి పెట్టాలి.
- డ్రైవర్ మద్యం, మత్తు పానియాలకు దూరంగా ఉండాలి. ముందు, వెనుక, పక్కభాగాలను పరిశీలిస్తూ డ్రైవింగ్ చేయాలి.
- డ్రైవర్ పక్కన, వాహనం ముందు భాగంలో ఇతరులెవరినీ కూర్చోనివ్వొద్దు. రోడ్లపై ఉండే గుంతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
- విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విగ్రహానికి తగలకుండా వాటిని తప్పించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవేశానికి లోను కాకూడదు.
- ట్రాక్టర్ పైన ప్రతిమ వద్ద ఎక్కువ మంది ఉండకుండా చూసుకోవాలి. డ్రైవర్‌ను సదరు నిర్వాహకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి.

శోభాయాత్రలో జాగ్రత్తలు..

- వినాయక నిమజ్జనోత్సవ శోభాయాత్ర భక్తి ప్రపత్తుల మధ్య జరుపుకోవాలి. ఇందులో ప్రధానంగా క్యూ పద్ధతి పాటించడం మేలు. ఒక వాహనం తర్వాత మరో వాహనం వరుస క్రమంలో వెళ్లాలి. తిలకించే భక్తులకూ సౌకర్యంగా ఉంటుంది.
- శోభాయాత్రలో పూర్తిగా సంయమనం పాటించాలి. యువకులు ఎలాంటి ఉద్వేగాలకు పోకూడదు. కేటాయించిన నంబర్ల ప్రకారమే క్రమపద్ధతి పాటించాలి.
- ఉత్సవ సమితివారు, పోలీసులు సూచించిన విధివిధానాలపై శ్రద్ధ పెట్టాలి.
- విద్యుత్ వైర్ల కింద నుంచి సెట్టింగులు లేకుండా జాగ్రత్త పడాలి. లైటింగ్, విద్యుత్ కోసం వాడే వైర్లు నాణ్యమైనవే వాడాలి. తెగిపోవడం, జాయింట్లు వేయడం వంటివి లేకుండా చూసుకోవాలి.
- సెట్టింగుల సమీపంలో బాణసంచా పేల్చకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాలు సంభవించే వాటిని సమీపంలో లేకుండా చూసుకోవాలి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఆర్పేందుకు వీలుగా అవసరమైన నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచాలి.
- ఆది దేవున్ని దర్శించుకునే భక్తులకు ప్రతిమ వద్దకు వెళ్లేందుకు వీలుగా పకడ్బందీగా మెట్లు, స్టేజీలను ఏర్పాటు చేయాలి. దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దష్టిలో ఉంచుకొని ముందుగానే ఎలాంటి తోపులాటలు జరగకుండా ఒకరి తర్వాత ఒకరు దర్శించుకునేలా బారీకేడ్లను ఏర్పాటు చేయాలి.

నిమజ్జనం వేళ జాగ్రత్తలు ఇలా..

- ప్రతిమలను ప్రవహించే నదులు, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, లోతైన వాటిల్లో నిమజ్జనం చేస్తారు. అధికార యంత్రాంగం ఏర్పాటు చేసిన క్రేన్లు, తదితర వాటి సమీపంలోకి వెళ్లకూడదు. సూచనలు, విధివిధానాలు తప్పక పాటించాలి.
- పోలీసులు, నిమజ్జనం చేసే సదరు నిర్వాహకుల హెచ్చరికలు కాదని చెరువులు, నదులు, కుంటలు, ప్రాజెక్టుల నీటిలోకి వెళ్లేందుకు సాహసించకూడదు. ఈత రానివారు ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లలోకి దిగకూడదు.
- నిత్యం ఎంతటి భక్తితో ఆదిదేవున్ని కొలిచామో అదే మాదిరిగా నిమజ్జన శోభాయాత్రలోనూ ప్రతిఒక్కరూ భక్తి పారవశ్యంతో విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరున్ని కొలవాలి.
- భక్తులకు అందజేసే ప్రసాదాన్ని ఇష్టారీతిన పారేయకుండా చేతికి అందివ్వాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పూర్తిస్థాయిలో సామరస్యపూర్వక వాతావరణం కలిగేలా చూడాలి.
- నిర్వాహకులు శాంతి, సామరస్యపూర్వకంగా ఉండాలి. ప్రధానంగా ఊరేగింపు సమయంలో ఆధ్యాత్మిక చింతన ప్రజ్వరిల్లేలా దేశ సంస్కృతి, సంప్రదాయాలను వెల్లివిరిసే భక్తి పాటలు, నృత్యాలు, కోలాటాలు వేసుకుంటూ వెళ్లాలి.
- మండపాల నిర్వాహకులు తమతో వచ్చే సభ్యులను తీసుకెళ్లడంతో పాటు వారిని తిరిగి ఇంటికే చేర్చే వరకు బాధ్యతగా వ్యవహరించాలి.

చెత్తతోనూ ఎరువుల తయారీ



ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న రజినీకాంత్

ఇల్లెందురూరల్: వ్యర్థమని దేనినీ విస్మరించొద్దని, సమాలోచన చేస్తే సద్వినియోగమవుతుందని సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం తడిపొడి చెత్త నుంచి ఎరువు తయారీ యూనిట్‌ను సందర్శించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను కంపోస్ట్ యార్డ్‌కు తరలించడం, దీని నుంచి ఎరువు ఎలా తయారు చేస్తారో సర్పంచ్ మంగమ్మ, కార్యదర్శి రజినీకాంత్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సమాజం ఆ దిశగా పయనించేందుకు స్థానికులను చైతన్య పరచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పోలారపు పద్మ, ఎన్ఎస్ఎస్ విభాగం ఇన్‌చార్జ్ రాజు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి మార్గాలు చూపండి



మాట్లాడుతున్న ముద్దా భిక్షం

పాల్వంచరూరల్: దేశ భవిష్యత్, సమాజాభివృద్ధి యువశక్తిపై ఆధారపడి ఉంది. అటువంటి యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకుల విధానాల వలన పక్కదారి పడుతున్నారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ సభ్యుడు, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కేవీస్ ప్రదీప్, ముద్దా భిక్షం ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని కొమురం భీమ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం జిల్లా 8వ మహాసభ జిల్లా అధ్యక్షుడు వాసం బుచ్చిరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి వాంకుడొతు అజయ్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టి అమరులైన పీవైఎల్ కామ్రేడ్లకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువశక్తిని పాలకులు అనేక ప్రలోభాలకు గురిచేసి నీరుకారుస్తున్నారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి సక్రమైన మార్గంలో నడిపించాల్సిన ప్రభుత్వాలు వారిని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం మద్యంషాపులను పెంచడం, గల్లీగల్లీకి బెల్ట్ షాపులను ఏర్పాటు చేయడంతో యువత మద్యానికి బానిసలై విద్యకు దూరం అవుతున్నారన్నారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వచ్చే నెల 12,13వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

పంటలను నమోదు చేసుకోవాలి

జూలూరుపాడు: రైతులు పంటల వివరాలను తప్పని సరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.రఘుదీపిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాలేని రైతుల వివరాలు వ్యవసాయశాఖ వద్ద లేవని, రైతులు తమ సొంత భూమిలో ఏ పంటలు వేసారో క్లస్టర్ ఏఈఓల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఆలయానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న రాజేష్

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం, దసరా నవరాత్రోత్సవాలకు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీకి చెందిన రాజేష్ రూ.20,116, పాల్వంచలోని గట్టాయిగూడెంకు చెందిన పలుకూరు చిన్నరాయుడు – విజయలక్ష్మి దంపతులు రూ.5,116 విరాళం అందజేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు.

గాలివానకు నేలవాలిన పంటలు

పాల్వంచరూరల్: ఉరుములు, మెరుపులతో గాలివానకు పూత, కాతకు వచ్చిన పత్తి, మిర్చి పంటలు నేలకు వాలి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కురిసింది. కోడింపుజుల వాగు, పునుకుల గ్రామాల్లో, దేవిజ్యా తండా, పూసలతండాల్లో పలువురి రైతుల పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని జగదాంబసెంటర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రవూఫ్ తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన ఝాన్సీ, పద్మ మూడు రోజుల క్రితం జగదాంబసెంటర్ వద్ద స్కూటీపై వెళుతుండగా కారు స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆదరించండి.. రెట్టింపు అభివృద్ధి చేస్తా..



పాల్వంచ: ఎమ్మెల్యే వనమాకు వినతిపత్రం అందిస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు

పాల్వంచ: ఏ గల్లీలో చూసినా తన అభివృద్ధి శిలాఫలాకాలు కనిపిస్తాయని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.15కోట్ల నిధులతో మంజూరైన పలు అభివృద్ధి పనులను వెంకటేశ్వర హిల్స్ కాలనీ, బాపూజీనగర్, కాంట్రాక్టర్స్ కాలనీ ఏరియాల్లో మంగళవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. కేసీఆర్ తన కృషిని చూసి మళ్లీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, ఆదరిస్తే రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రతి గడపకు బీఆర్ఎస్ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు చెప్పారు. త్వరలోనే ఇంటింటికీ గోదావరి జలాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, డీఈ మురళీ, ఏఈ రాజేశ్, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పెద్దమ్మగుడి చైర్మన్ మహిపతి రామలింగం, వనమా రాఘవేందర్‌రావు, మంతపురి రాజుగౌడ్, ఆచార్యులు, మల్లెల శ్రీరామ్మూర్తి, సింధు తపస్వీ, మేదరమెట్ల శ్రీనివాసరావు, రమణమూర్తి నాయుడు, కాల్వ ప్రకాశరావు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచండి...

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల వేతనాలు పెంచాలని సిబ్బంది ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును మంగళవారం కలిసి విన్నవించారు. స్పందించి ఎమ్మెల్యే రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు లేఖ రాశారు. స్వయం సంఘాల ద్వారా ప్రజలకు కల్పించిన సంక్షేమ పథకాలను అమలు పర్చడంలో క్షేత్ర స్థాయిలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. వాక్సినేషన్, హరితహారం, స్వచ్ఛ సర్వేక్షణ్, తడి, పొడి చెత్త, జియో టాగింగ్, కంటి వెలుగు వంటి వెలుగు వంటి అనే పథకాలను ప్రజలకు చేరవేయడంలో రిసోర్స్ పర్సన్ల పాత్ర అభినందనీయమైందన్నారు. వీరి వేతనాల పెంపును పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెగిలి సంధ్య, కె.మంజుల, కె.స్వరూప, ఎం.లక్ష్మి, ఎం.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాల వేడుకలకు రండి...

కొత్తగూడెంటౌన్: నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న వినాయక నవరాత్రి నిమజ్జనం వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావుకు కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కోశాధికారి దారా రమేష్, జల్లరాపు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపించండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలో ఇళ్ల స్థలాల పంపిణీ అవకతవలపై విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి నాగయ్య గడ్డలో పర్యటించారు. మాట్లాడుతూ.. సోమవారం ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయని, స్థానిక కౌన్సిలర్లు ఒక్కొక్కరి వద్ద రూ.30 నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపించారు. సొంత ఇల్లు ఉన్నవారికి, పక్క మండలంలో, పక్క జిల్లాలో ఉంటున్న వారికి, ఒక వార్డులో ఉంటున్న వారికి మరో వార్డులో మంజూరయ్యేలా చేశారని విమర్శించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు సూచించిన వారినే లబ్ధిదారులుగా ప్రకటించారని పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపి ఇళ్లు లేని పేదలకు, ఎన్నో ఏళ్లుగా కిరాయి ఇళ్లలో నివాసం ఉండే నిరుపేదలకు న్యాయం చేయాలని, ఇంటి స్థలాల కోసం డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, చెనిగారపు నిరంజన్‌కుమార్, నాగుల రవికుమార్, నాని, సిద్దంకి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థినులకు అభినందనలు



క్యాంప్‌లో పాల్గొన్న వారితో జీఎం, కరస్పాండెంట్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఈనెల 1నుంచి 9 వరకు, 11 నుంచి 20వ తేదీ వరకు వరంగల్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో సీఏటీసీ (కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్)లో పాల్గొన్నారు. క్యాంప్‌లో ఎన్‌సీసీ అధికారులు విద్యార్థినులకు వెపన్ ట్రైనింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్ స్కిల్స్, సెక్షన్ ఫార్మేషన్ తదితర అంశాలపై అగాహన కల్పించారు. ఈ శిక్షణలో కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. బాలతేజస్విని ఖమ్మంలో జరగనున్న క్యాంప్‌కు ఎంపికై ంది. మౌనాంజరి బెస్ట్ పర్‌ఫార్మర్‌గా ప్రశంశలు అందుకుంది. విద్యార్థినులను మంగళవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో సింగరేణి జీఎం (ఎడ్యుకేషన్) ఎన్.వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ నికోలస్, ప్రిన్సిపాల్ సీహెచ్ శారద, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీలత అభినందించారు.

విప్లవ ధృవతార ముక్తార్ పాషా

టేకులపల్లి: విప్లవ కార్మిక ఉద్యమ ధృవతార ముక్తార్ పాషా ఆశయాలను కొనసాగిద్దామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎండీ.రాసుద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్కే ముక్తార్ పాషా మూడో వర్ధంతి సందర్భంగా టేకులపల్లి హమాలి కార్మికుల అడ్డా వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ముక్తార్ పాషా చదువుకునే రోజుల్లో పీడీఎస్‌యూ ద్వారా ఉద్యమ పాఠాలు నేర్చుకొని కార్మిక వర్గ పక్షపాతిక పీడిత ప్రజల విముక్తి సాధనే లక్ష్యంగా 40 సంవత్సరాల పాటు విప్లవ ఉద్యమమే ఆశగా, శ్వాసగా జీవించారని కొనియాడారు. సింగరేణి, టైల్స్, మోటర్, హమాలీ, తదితర సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గానికి దశను దిశను చూపించే నాయకుడిగా ఎదిగాడన్నారు. నెల్లూరు నాగేశ్వరరావు, నగేష్, శంకర్, బాబు, నరసయ్య, రాములు బోడ మంచా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో అధికారులు విఫలం

సింగరేణి(కొత్తగూడెం): రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, సింగరేణి లీజ్ స్థలాలే కాక రెవెన్యూ భూములు కబ్జాకు గురవుతున్నా కాపాడడంలో అధికారులు విఫలమవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా విమర్శించారు. స్థానిక శేషగిరి భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిలువ నీడ కోసం గుడిసెలు వేసుకునే పేదలపై జులుం ప్రదర్శించే అధికారులు... రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతుంటే మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు వై.శ్రీనివాస్‌రెడ్డి, బందెల నర్సయ్య, సలిగంటి శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, నూనావత్ గోవిందు, లక్ష్మీనారాయణ, గోనె మణి, విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, అజిత్, గోనె సురేష్, బరిగెల భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల్లో ప్రత్యేక పూజలు

వినాయక చవితి నవరాత్రి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి మంగళవారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలుచోట్ల మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అన్నదానాలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



సింగరేణి(కొత్తగూడెం): గణేష్ మండపాన్ని సందర్శిస్తున్న కూనంనేని సాంబశివరావు



నవభారత్: అన్నదానం ప్రారంభిస్తున్న బండారి



జూలూరుపాడు: వెంగన్నపాలెంలో అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పురుషోత్తం



టేకులపల్లి: ప్రెగళ్లపాడులో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

వీర వనిత చాకలి ఐలమ్మ..

తెలంగాణ వీరనారి, సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ జయంతి సందర్భంగా మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆమె చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. సాయుధ ఉద్యమంలో ఆమె తెగువను మననం చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి వేడుకలో ప్రజాప్రతినిధులు,అధికారులు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



కొత్తగూడెంఅర్బన్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దిండిగల రాజేందర్



పాల్వంచ: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు